కేజ్రీవాల్‌పై స్పిరిట్ చల్లిన యువకుడు!

ఇది హత్యా ప్రయత్నం: ఆప్

న్యూఢిల్లీ: ఢిల్లీ మాజీ మాజీ సీఎం, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఢిల్లీ పాదయాత్రలో గందరగోళం నెలకొన్నది. శనివారం షేక్ సరాయ్ ప్రాంతంలో ఆయన పాదయాత్ర చేస్తుండగా ఓ యువకుడు గుర్తు తెలియని ద్రవాన్ని ఆయన పైకి చల్లాడు. వెంటనే కేజ్రీవాల్ భద్రతా సిబ్బంది, ఆప్ కార్యకర్తలు అతడిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. కేజ్రీవాల్‌పై హత్యాయత్నం జరిగిందని ఆయన పక్కనే ఉన్న ఢిల్లీ మంత్రి భరద్వాజ్ ఆరోపించారు. దుండగుడు కేజ్రీవాల్‌పై స్పిరిట్ చల్లాడని, మరో వ్యక్తి అగ్గిపెట్టె పచ్చారని ఆయన పేర్కొన్నారు. అయితే కేజ్రీవాల్‌పై చల్లింది నీళ్లేనని ఢిల్లీ పోలీసులు పేర్కొన్నారు.

ఒక్కలిగ పీఠాధిపతిపై కేసు
మండిపడ్డ విపక్షాలు

చెన్నపట్నం: ముస్లింలకు ఓటు హక్కును నిరాకరించాలంటూ ప్రకటన చేసిన ఒక్కలిగ పీఠాధిపతిపై కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం కేసు నమోదు చేయడంపై కేంద్ర మంత్రి కుమార స్వామి ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రాబోయే రోజుల్లో అరాచకం ఏర్పడుతుందని హెచ్చరించారు. తనపై జాతి వివక్ష వ్యాఖ్యలు చేసిన రాష్ట్ర మంత్రిపై ఎలాంటి చర్యలు తీసుకోని ప్రభుత్వం ఇప్పుడు ఒక్కలిగ మహా సంస్థాన మఠం పీఠాధిపతి కుమార చంద్రశేఖరకాంత విషయంలో శీఘ్రంగా ఎందుకు స్పందించిందని ప్రశ్నించారు. ఆయనను వేధించి, ఇబ్బంది కలిగించాలన్న ఉద్దేశంతోనే సిద్ధూ ప్రభుత్వం ఎఫ్‌ఆర్ నమోదు చేసిందని బీజేపీ ఆరోపించింది.

'సంభల్'లో ఎస్పీ నేతల
ప్రవేశం అడ్డగింత

ప్రభుత్వ పరిపాలన విఫలమైంది: అఖిలేశ్

న్యూఢిల్లీ, నవంబర్ 30: యూపీలోని 'సంభల్' హింసాత్మక ఘటనలపై వాస్తవ పరిస్థితుల్ని తెలుసుకునేందుకు ఆ రాష్ట్ర ప్రధాన ప్రతిపక్షం సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) ప్రయత్నించింది. శనివారం ఎస్పీ బృందం సంభల్ చేరుకోగా పోలీసులు అడ్డుకున్నారు. బయట వ్యక్తులు సంభల్‌లో ప్రవేశించకుండా డిసెంబర్ 10 వరకు నిషేధాజ్ఞలను జారీ చేసినట్టు అధికారులు తెలిపారు. తమను అడ్డుకోవటంపై ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ మండిపడ్డారు. నిషేధం విధించటం బీజేపీ ప్రభుత్వ పరిపాలన, ప్రభుత్వ నిర్వహణ వైఫల్యమని విమర్శించారు. సంభల్ అధికారులను సస్పెండ్ చేయాలని అఖిలేశ్ ఉన్నతాధికారులను డిమాండ్ చేశారు.

వారణాసి రైల్వే స్టేషన్‌లో
అగ్ని ప్రమాదం

150కి పైగా ద్విచక్ర వాహనాలు దగ్ధం

వారణాసి, నవంబర్ 30: యూపీలోని వారణాసి కంటోన్మెంట్ రైల్వే స్టేషన్‌లోని పార్కింగ్ ప్రదేశంలో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ప్లాట్‌ఫారం ఒకటికి సమీపంలో ఉన్న ఈ పార్కింగ్ స్టాండ్‌లో శుక్రవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో 150కి పైగా ద్విచక్ర వాహనాలు కాలి బూడిదయ్యాయి. అయితే ఈ ప్రమాదంలో ఎవరూ మరణించ లేదని, గాయపడలేదని రైల్వే అధికారులు తెలిపారు. అగ్ని మాపక, ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ సిబ్బంది మంటలను అదుపు చేశారు. రైల్వే ఉద్యోగుల కోసం ఏర్పాటు చేసిన పార్కింగ్ స్టాండ్‌లో వందకుపైగా వాహనాలు దగ్ధమయ్యాయని, నష్టం ఎక్కువగానే ఉందని అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్ లాల్జీ చౌదరి తెలిపారు.

పార్టీ నుంచి కేపీసీసీ ప్రధాన కార్యదర్శి బహిష్కరణ

బెంగళూరు: కర్ణాటక కాంగ్రెస్ నేత బీ గురప్ప నాయుడిపై బహిష్కరణ వేటు పడింది. ఆయన ఓ టీచర్‌ను లైంగికంగా వేధించారని, ఆమె గౌరవ, మర్యాదలకు భంగం కలిగించారని కేసు నమోదవడంతో కాంగ్రెస్ పార్టీ ఈ చర్య తీసుకుంది. ఆయనను పార్టీ నుంచి ఆరు సంవత్సరాలపాటు బహిష్కరిస్తున్నట్లు కర్ణాటక పీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ రహమాన్ ఖాన్ శనివారం ప్రకటించారు. గురప్ప ప్రస్తుతం కేపీసీసీ ప్రధాన కార్యదర్శిగా పని చేస్తున్నారు.

అంతు చిక్కని 'మహాయుతి' నాడి

- సీఎం, మంత్రి పదవుల పంపకంపై కూటమిలో విభేదాలు!
- షిండేను పక్కన పెడుతున్నారని శివసేన నేత శిర్సట్ విమర్శ
- 5న కొత్త ప్రభుత్వం ప్రమాణం..సీఎం పోస్ట్ బీజేపీకే: పవార్

ముంబై, నవంబర్ 30(నమస్తే తెలంగాణ), ముంబై: మహారాష్ట్ర శాసన సభ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన మహాయుతి పదవుల పంపకంలో ఓ నిర్ణయానికి రాలేకపోతున్నది. ఉప ముఖ్యమంత్రికే హోం శాఖను ఇవ్వాలని శివసేన పట్టుబడుతున్నది. తమ నేత షిండేను పక్కనబెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని మండిపడుతున్నది. ఎన్‌సీపీ చీఫ్ అజిత్ పవార్ మాత్రం బీజేపీకే ముఖ్యమంత్రి పదవి అని, ఎన్‌సీపీ, శివసేనలకు ఉప ముఖ్యమంత్రి పదవులు అని స్పష్టం చేశారు. అదే సమయంలో నూతన ప్రభుత్వ ఏర్పాటుకు ముహూర్తం ఖరారైందని బీజేపీ ప్రకటించింది. మరోవైపు మహాయుతి కూటమి విచ్ఛిన్నం దిశగా అడుగులు వేస్తున్నదని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. మొత్తానికి మహాయుతి రాజకీయాలు అంతు చిక్కుకుండా ఉన్నాయి. శివసేన(షిండే వర్గం) నేత సంజయ్ శిర్సట్ శనివారం మాట్లాడుతూ..ఉప ముఖ్యమంత్రికే హోం మంత్రి పదవిని ఇవ్వాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రే హోం మంత్రి పదవిని నిర్వహించడం సరికాదన్నారు. సంక్షేమ పథకాలు చాలా కాలం నుంచి అమల్లో ఉన్నప్పటికీ, వాటికి షిండే కొత్త ఊపును తెచ్చారని, అందుకే ఎన్నికల్లో కూటమి పక్షాలకు సత్ఫలితాలు లభించాయని చెప్పారు. మరో రెండున్నరేండ్లు ఆయనే ముఖ్యమంత్రిగా కొనసాగి ఉంటే, మరింత ఎక్కువ కృషి చేసి ఉండేవారన్నారు. అటువంటి షిండేను పక్కన బెట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. మరాఠా కోటా ఉద్యమకారులకు నచ్చ చెప్పే బాధ్యతను షిండే తన భుజస్కంధాలపై వేసుకున్నారని చెప్పారు. ఆయన మరాఠా రిజర్వేషన్ కూడా ఇచ్చారని, అందుకే ఆయనకు మద్దతు పెరిగిందని తెలిపారు. ముఖ్యమంత్రి మారీ లడ్కి బహిన్ పథకం ప్రభావం ఎన్నికల్లో మహాయుతిపై స్పష్టంగా కనిపించిందన్నారు.

సంజయ్ శుక్రవారం మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పేరును బీజేపీ అధిష్ఠానం శుక్రవారం అర్ధరాత్రికి ప్రకటిస్తుందనే సమాచారం ఉందన్నారు. ఆ తర్వాతి 24 గంటల్లో ఏక్‌నాథ్ షిండే చాలా పెద్ద నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. మరోవైపు మహాయుతి 2.0 ప్రభుత్వం గురువారం సాయంత్రం 5 గంటలకు ప్రమాణ స్వీకారం చేస్తుందని మహారాష్ట్ర బీజేపీ శాఖ చీఫ్ చంద్రశేఖర్ శనివారం ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

శివసేన, ఎన్సీపీలకు డిప్యూటీ సీఎం పోస్టులు

ఎన్‌సీపీ చీఫ్ అజిత్ పవార్ మహారాష్ట్ర ప్రభుత్వ ఏర్పాటుపై సస్పెన్స్‌కు కొంత వరకు తెరదించారు. ఆయన శనివారం మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పదవి బీజేపీకేనని స్పష్టం చేశారు. మహాయుతిలోని శివసేన, ఎన్‌సీపీలకు ఉప ముఖ్యమంత్రి పదవులు వస్తాయని చెప్పారు.

సీఎం రేసులో ముందంజలో ఫడ్నవీస్

బీజేపీ వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం, మహారాష్ట్ర ముఖ్యమంత్రి రేసులో దేవేంద్ర ఫడ్నవీస్ ముందంజలో ఉన్నట్లు తెలుస్తున్నది. ఆయన రెండుసార్లు ముఖ్యమంత్రిగా, గత ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా పని చేశారు.

ఏక్‌నాథ్ షిండేకు అస్వస్థత

మహారాష్ట్ర ఆపద్ధర్మ ముఖ్యమంత్రి, శివసేన(షిండే వర్గం) చీఫ్ ఏక్‌నాథ్ షిండే అస్వస్థతతో బాధ పడుతున్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై సతారా సివిల్ సర్జన్ యువరాజ్ కార్పే మాట్లాడుతూ, షిండే శ్వాసనాళం ఇన్ఫెక్షన్‌తో బాధ పడుతున్నారని తెలిపారు. ఆయనకు నీరసం, జ్వరం, గొంతులో దురద ఉన్నట్లు చెప్పారు. పల్స్ రేటు, బీపీ సాధారణంగా ఉన్నాయన్నారు. నీరసంగా ఉన్నందువల్ల రెండు రోజుల పాటు విశ్రాంతి తీసుకోవాలని సూచించినట్లు చెప్పారు.

విచ్ఛిన్నం దిశగా!

మహాయుతి కూటమి విచ్ఛిన్నం దిశగా అడుగులు వేస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. ముఖ్యమంత్రి పదవిని దేవేంద్ర ఫడ్నవీస్‌కు కట్టబెట్టడాన్ని ఏక్‌నాథ్ షిండే తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని, సీఎం పదవిని ఇవ్వకపోయినా, శాంతి భద్రతలతో సహా హోం శాఖను పూర్తిగా తమకే ఇవ్వాలని ఆయన పట్టుబడుతున్నారని చెప్తున్నారు. దీనికి బీజేపీ పెద్దలు ససేమిరా అనడంతో ఆయన అలిగి, అన్ని కార్యక్రమాలను రద్దు చేసుకుని, సొంతూరుకు వెళ్లిపోయారని అంటున్నారు. మహాయుతితో తెగదెంపులు చేసుకోవాలని శివసేన నేతలు ఆయనకు సలహా ఇస్తున్నట్లు మీడియా కథనాలను బట్టి తెలుస్తున్నది.

చెన్నైలోని మేడవాక్కం రోడ్డుపై భారీగా చేరిన వర్షపు నీరు

తమిళనాడులో 'ఫెంగల్' బీభత్సం

- తీర ప్రాంతాల్లో భారీ వర్షాలు.. స్తంభించిన జన జీవనం
- చెన్నై ఎయిర్‌పోర్టు బంద్.. విమానాల దారి మళ్లింపు
- పుదుచ్చేరి, ఆంధ్రప్రదేశ్ పైనా తుఫాను ప్రభావం

చెన్నై, నవంబర్ 30: 'ఫెంగల్' తుఫాను ప్రభావంతో తమిళనాడు, పుదుచ్చేరిలో శనివారం భారీ వర్షాలు కురిశాయి. చెన్నై నగరంలో కుండపోత వర్షం పడింది. అనేక కాలనీలు, రోడ్లు జలమయమయ్యాయి. దీంతో నగరంలో జనజీవనం స్తంభించిపోయింది. తిరువల్లూర్, కాంచీపురం, కళ్లకురిచి, కడలోర్ జిల్లాల్లోనూ భారీగా వర్షాలు పడ్డాయి. ఈ జిల్లాల్లో స్కూళ్లు, కళాశాలలను మూసివేశారు. తుఫాను కారణంగా గంటకు 80 - 90 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచాయి. దీంతో శనివారం మధ్యాహ్నం 12.30 నుంచి ఆదివారం ఉదయం 4 గంటల వరకు చెన్నై విమానాశ్రయంలో కార్యకలాపాలన్నీ నిలిపివేశారు. చెన్నైకు రావాల్సిన విమానాలను బెంగళూరుకు దారి మళ్లించారు. లోకల్ రైళ్ల సేవలకు సైతం అంతరాయం కలిగింది. భారీ వర్షాలు కురుస్తుండటంతో తమిళనాడులోని ఏడు జిల్లాల్లో రెడ్ అలర్ట్, 10 జిల్లాల్లో ఆరెంజ్ అలెర్ట్ జారీ చేశారు. తుఫాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో సీఎం స్టాలిన్ సమీక్ష నిర్వహించి.. అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కాగా, తుఫాను ప్రభావంతో ఆదివారం కూడా తమిళనాడు, పుదుచ్చేరితో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ ప్రాంతంలో భారీ వర్షపాతం నమోదవుతుందని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది..

ఏటీఎంలో విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

చెన్నైలో వర్షాల కారణంగా విద్యుత్ షాక్‌కు ఓ వ్యక్తి బలయ్యాడు. డబ్బులు డ్రా చేయడానికి అతడు ఏటీఎంకు వెళ్లగా, అప్పటికే అందులో వరద నీరు నిలిచింది. నీటిలోకి వెళ్లగానే అతడు కరెంట్ షాక్‌కు గురై అక్కడికక్కడే మరణించాడు. వర్షపు నీటిలో మృతదేహం తేలుతూ ఉండటాన్ని స్థానికులు గుర్తించారు.

సమాఖ్య వ్యవస్థలో ప్రతి విభాగానికీ పరిధి ఉండాలి

- కేంద్ర అధికారులను రాష్ట్రాలు అరెస్టు చేయడం రాజ్యాంగ సంక్షోభానికి దారి తీయొచ్చు
- ఈడీ పిటిషన్‌పై సుప్రీంకోర్టు ధర్మాసనం వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, నవంబర్ 30: సమాఖ్య వ్యవస్థలో ప్రతి విభాగానికి గుర్తింపు, పరిధి ఉండేలా చూసుకోవాలని సుప్రీంకోర్టు పేర్కొన్నది. రూ.20 లక్షల లంచం తీసుకున్నారనే ఆరోపణలతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారి అంకిత్ తివారిపై తమిళనాడు డైరెక్టరేట్ ఆఫ్ విజిలెన్స్ అండ్ యాంటీ కరెప్షన్(డీవీఏసీ) కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నది. ఈ కేసును సీబీఐకి బదిలీ చేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో ఈడీ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ధర్మాసనం విచారించింది. 'సమాఖ్య స్ఫూర్తిలో ప్రతి విభాగానికి గుర్తింపు, పరిధి ఉండేలా చూసుకోవాలి. కేంద్ర అధికారులను రాష్ట్రాలు ఏకపక్షంగా అరెస్టు చేయడం రాజ్యాంగ సంక్షోభానికి దారి తీయొచ్చు. ఈ అధికారం రాష్ట్రాలకు ఉందని చెప్పడం సమాఖ్య వ్యవస్థకు ప్రమాదకరంగా మారొచ్చు. అలాగని రాష్ట్ర పోలీసులు వారి పరిధిలో విచారణ జరిపే అధికారాన్ని కాదనడం కూడా సరికాదు'అని ధర్మాసనం పేర్కొంటూ విచారణను వచ్చే నెలకు వాయిదా వేసింది.

చట్టబద్ధ ఆరోపణలన్నీ సమీక్షిస్తాం

మహారాష్ట్ర ఎన్నికలపై కాంగ్రెస్‌కు ఈసీ స్పష్టీకరణ

న్యూఢిల్లీ: మహారాష్ట్ర శాసన సభ ఎన్నికల్లో అన్ని ప్రక్రియలను పారదర్శకంగా నిర్వహించినట్లు ఎన్నికల కమిషన్ (ఈసీ) కాంగ్రెస్‌కు తెలిపింది. చట్టబద్ధమైన అన్ని ఆరోపణల పైనా సమీక్ష జరుపుతామని చెప్పింది. ఎన్నికల ప్రక్రియపై సందేహాలు, అభ్యంతరాలపై చర్చించేందుకు ఓ ప్రతినిధి బృందాన్ని మంగళవారం పంపించాలని కాంగ్రెస్‌ను కోరింది. మహారాష్ట్ర శాసన సభ ఎన్నికల పోలింగ్, ఓట్ల లెక్కింపు ప్రక్రియలలో పొంతన లేదని కాంగ్రెస్ ఆరోపించింది. దీనిపై సాక్ష్యాధారాలను సమర్పించేందుకు వ్యక్తిగత విచారణకు అవకాశం కల్పించాలని ఈసీని కోరింది. దీనికి ఈసీ స్పందిస్తూ, పోలింగ్ స్టేషన్లవారీగా సమాచారం అభ్యర్థుల వద్ద ఉందని తెలిపింది. ప్రతి దశలోనూ అభ్యర్థులు లేదా వారి ఏజెంట్లు పాల్గొంటారని, ఈ సమాచారాన్ని తనిఖీ చేసుకోవచ్చునని వివరించింది.

అధికార దుర్వినియోగం జరిగింది: శరద్ పవార్

మహారాష్ట్ర శాసన సభ ఎన్నికల్లో అధికార దుర్వినియోగంతోపాటు, నిధుల వరదలు వెల్లువెత్తాయని ప్రజలు గుసగుసలాడుకుంటున్నారని ఎన్‌సీపీ (ఎస్‌పీ) చీఫ్ శరద్ పవార్ చెప్పారు. ప్రముఖ హక్కుల ఉద్యమకారిణి మేధా పాట్కర్ మాట్లాడుతూ ఎలక్ట్రిక్ కనెక్షన్‌తో కొన్ని సిస్టమ్స్‌ను మార్చవచ్చునని ప్రయోగాలు వెల్లడించాయని తెలిపారు.

మనుషులను మెషీన్లతో భర్తీ చేయాలనుకుంటున్నారు

ఏఐపై అంతర్జాతీయ విధానం అవసరమన్న 'ఏఐ పితామహుడు'

మాంట్రియల్: కొందరు శక్తిమంతులు మనుషులను ఏఐ ద్వారా భర్తీ చేయాలని కోరుకుంటున్నారని కెనడా కంప్యూటర్ శాస్త్రవేత్త, 'ఏఐ పితామహుడి'గా గుర్తింపు పొందిన యోషువా బెంగియో పేర్కొన్నారు. టెక్ దిగ్గజాలను ఉద్దేశించి ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఏఐతో పొంచి ఉన్న ప్రమాదంపై ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. 'జ్ఞానం శక్తిని ఇస్తుంది. ఆ శక్తిని దుర్వినియోగం చేయాలనుకునే వారు ఉన్నారు. మనుషులను యంత్రాలు భర్తీ చేయడాన్ని చూసి ఆనందించే వారూ ఉన్నారు.' అంటూ ఆయన వ్యాఖ్యానించారు. ఇలాంటి వ్యక్తులు గుప్పెడు మందే ఉన్నప్పటికీ, వారు శక్తిమంతులని అన్నారు. వెంటనే సరైన పరిమితులను విధించకపోతే వారు ఈ పనిని చేయగలరని హెచ్చరించారు. ఏఐ రంగంలో పెరుగుతున్న శక్తిని అదుపు చేయడానికి ప్రపంచ నాయకులు అడుగులు వేయాల్సిన అవసరం ఉందని, దీనిపై అంతర్జాతీయ విధానం తీసుకు రావాలని అన్నారు. మానవ మేధస్సు స్థాయిని ఏఐ ఎప్పుడూ సాధిస్తుందో ఎవరూ చెప్పలేరని ఆయన అన్నారు.

బంగ్లాదేశ్‌లో 3 ఆలయాలు ధ్వంసం

- హిందూ, భారత వ్యతిరేక నినాదాలు
- భైరవ్‌లోని ఇస్కాన్ కేంద్రం పైనా దుండగుల దాడి
- హిందూ పూజారి, మరొకరి అరెస్ట్!
- కృష్ణ దాస్ కార్యదర్శి అదృశ్యం

బంగ్లాదేశ్‌లో హిందువులకు వ్యతిరేకంగా విధ్వంసానికి దిగిన అల్లరి మూకలు (ఫైల్)

ఢాకా: బంగ్లాదేశ్‌లో హిందూ మత వ్యతిరేక అల్లర్లు కొనసాగుతున్నాయి. తాజాగా పోర్ట్ సిటీ చిట్టగాంగ్‌లోని హరిశ్‌చంద్ర మున్సఫ్ లేన్‌లో ఉన్న శంతనేశ్వరి మాత్రి ఆలయంతో పాటు సమీపంలోని సోనీ ఆలయం, శంతనేశ్వరి కలిబరీ ఆలయాలను లక్ష్యంగా చేసుకున్న దుండగులు శుక్రవారం దాడి చేసి ధ్వంసం చేశారు. వందలాది మంది ఆందోళనకారులు హిందూ, భారత వ్యతిరేక నినాదాలు చేస్తూ ఇటుకలతో ఆలయాలపై దాడి చేసి విధ్వంసం సృష్టించారు. అయితే, పోలీసులు మాత్రం ఈ ఘటనను తేలిగ్గా తీసుకున్నారు. ఇరు వర్గాలు ఒకరిపై ఒకరు ఇటుకలు విసురుకునే క్రమంలో ఆలయాలు స్వల్పంగా దెబ్బ తిన్నాయని పేర్కొన్నారు. మిలటరీ రంగంలోకి దిగి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చింది. మరోవైపు ఇస్కాన్‌కు చెందిన హిందూ పూజారి శ్యామ్ దాస్, మరో వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఇటీవల అరెస్టయిన హిందూ, ఇస్కాన్ నేత చిన్మయ్ కృష్ణ దాస్‌ను కలిసేందుకు జైలుకు వెళ్లిన సమయంలో శ్యామ్ దాస్‌ను, మరో వ్యక్తిని అరెస్టు చేశారని, అలాగే కృష్ణ దాస్ కార్యదర్శి కూడా అదృశ్యం అయ్యారని ఇస్కాన్ కోల్‌కతా అధికార ప్రతినిధి రాధారామన్ దాస్ తెలిపారు. దీనిపై బంగ్లాదేశ్ అధికారిక ప్రకటన చేయలేదు. మరోవైపు భైరవ్‌లో ఉన్న ఇస్కాన్ కేంద్రంలో కొందరు దుండగులు విధ్వంసం సృష్టించారు. ఇందుకు సంబంధించిన వీడియోను రాధారామన్ దాస్ ట్వీట్ చేశారు.

'బంగ్లా దేశీయులకు వైద్యం చేయం'

ఇక నుంచి బంగ్లాదేశ్‌కు చెందిన వారికి చికిత్స చేయొద్దని కోల్‌కతాలోని జేఎన్ రే దవాఖాన నిర్ణయించింది. బంగ్లాదేశ్‌లో మైనారిటీ హిందువులపై దాడులు, భారత దేశ జెండాను అవమానించిన ఘటనల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు దవాఖాన అధికారి సుబ్రాంశు భక్త్ వెల్లడించారు.

మా ఆందోళనలను భారత్ పరిష్కరించాలి

ద్వైపాక్షిక సంబంధాలను మెరుగుపరిచేందుకు ఢాకా దీర్ఘకాల ద్వైపాక్షిక ఆందోళనలను భారత దేశం పరిష్కరించాల్సి ఉందని, అయితే ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సత్సంబంధాలపై తాము ఇంకా ఆశాజనకంగా ఉన్నట్లు బంగ్లాదేశ్ స్పష్టం చేసింది. ఇస్కాన్ నేత కృష్ణదాస్ అరెస్ట్‌తో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న క్రమంలో శనివారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో బంగ్లా విదేశీ వ్యవహారాల సలహాదారు తౌహిద్ హొస్సేన్ మాట్లాడారు. ఆగస్టు 5 తర్వాత ఇరు దేశాల మధ్య సంబంధాల మధ్య మార్పు చోటుచేసుకున్న మాట వాస్తవమేనన్నారు.

అరెస్ట్‌ను తప్పుగా అర్థం చేసుకున్నారు

బంగ్లాలో హిందూ నేత అరెస్ట్‌ను తప్పుగా అర్థం చేసుకున్నారని, అతడిని ఒక నిర్దేశిత ఆరోపణలతో అరెస్ట్ చేసినట్టు బంగ్లాదేశ్ సమర్థించుకుంది. యూఎస్ ఫోరమ్‌లో మైనారిటీల సమస్యలపై నిర్వహించిన సమావేశం సందర్భంగా జెనీవాలోని ఐరాస బంగ్లాదేశ్ శాశ్వత ప్రతినిధి, దౌత్యవేత్త తెరిక్ ఎండీ ఆరిఫుల్ ఇస్లామ్ ఈ మేరకు ఒక ప్రకటన చేశారు. బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై ఎలాంటి క్రమబద్ధమైన దాడి జరగలేదని హిందూ నేత అరెస్ట్ అంశం తమ న్యాయస్థానం పరిధిలో ఉందని ఆయన స్పష్టం చేశారు. కాగా, బంగ్లాదేశ్‌లో పరిస్థితులు ప్రమాదకరంగా ఉన్నాయని, మైనారిటీలపై నిత్యం దాడులు కొనసాగుతున్నాయని ఇంటర్నేషనల్ ఫోరమ్ ఫర్ సెక్యులర్ బంగ్లాదేశ్ (ఐఎఫ్ఎస్‌బీ) ప్రతినిధి ఒకరు సమావేశంలో ఆరోపించారు.

జనవరి 20కి ముందే అమెరికా వచ్చేయండి

విదేశీ విద్యార్థులకు యూఎస్ వర్సిటీల విజ్ఞప్తి

ట్రంప్ ఆంక్షలు విధిస్తారని భయం

న్యూయార్క్: అమెరికాలోని పలు యూనివర్సిటీలకు ట్రంప్ భయం పట్టుకుంది. అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించిన డొనాల్డ్ ట్రంప్ జనవరిలో బాధ్యతలు చేపట్టనున్న క్రమంలో అవి ముందుగానే అప్రమత్తమయ్యాయి. గతంలో ట్రంప్ అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే విదేశీ విద్యార్థులు, వృత్తి నిపుణుల ప్రయాణాలపై ఆంక్షలు విధించిన క్రమంలో ముందే జాగ్రత్త పడుతున్నాయి. విద్యార్థులు జనవరి 20కి ముందే అమెరికాకు వచ్చి విద్యా సంస్థల్లో చేరాలని భారత్ సహా పలు దేశాల్లోని విద్యార్థులకు ప్రయాణ సూచనలు జారీ చేస్తున్నాయి. ముఖ్యంగా మాసాచుసెట్స్, అమ్హెర్స్ట్ సహా పలు ప్రముఖ వర్సిటీల విదేశీ విద్యార్థులు, సిబ్బంది జనవరి 20లోగా తమ దేశానికి వచ్చేయాలని కోరాయి. యూనివర్సిటీలకు చెందిన ఆఫీస్ ఆఫ్ ఇంటర్నేషనల్ స్టూడెంట్ అఫెయిర్స్ కూడా ఇదే తరహా అడ్వయిజరీ జారీ చేసింది. వచ్చే ఏడాది జనవరి 20న అమెరికా అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టనున్న ట్రంప్ మొదటి రోజే ఇమ్మిగ్రేషన్, ఆర్థిక పాలసీలను లక్ష్యంగా చేసుకుంటారని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

చైనాలో భారీ బంగారు గని

- దాదాపు 1000 టన్నుల నిల్వలు
- విలువ రూ.7 లక్షల కోట్ల పైమాటే

న్యూఢిల్లీ: చైనాలో భారీ బంగారు గని బయల్పడింది. ఈ గనిలో దాదాపు 1000 టన్నుల అత్యంత నాణ్యమైన పుత్తడి నిల్వలు ఉన్నాయని, ఈ బంగారం విలువ సుమారు 83 బిలియన్ డాలర్ల (రూ.7,01,885 కోట్లు) మేరకు ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. ప్రపంచంలోనే అతి పెద్దదిగా పరిగణిస్తున్న ఈ పుత్తడి గని దక్షిణాఫ్రికాలోని సౌత్ డీప్ మైన్ (900 టన్నులు) కంటే పెద్దదని చెప్తున్నారు. పింగ్జియాంగ్ కౌంటీలో ఈ భారీ బంగారు గని ఉన్నట్టు హునాన్ ప్రావిన్స్ జియోలాజికల్ బ్యూరో ప్రకటించింది. భూగర్భ శాస్త్రవేత్తలు 2 కిలోమీటర్ల లోతులో 40 గోల్డ్ వెయిన్స్(బంగారం కలిగిన రాతి పొరలు)ను గుర్తించినట్టు వెల్లడించింది. ఈ వెయిన్స్‌లో 300 టన్నుల బంగారం ఉండవచ్చని, 3 కిలోమీటర్ల లోతులో మరిన్ని నిల్వలు ఉంటాయని తెలిసింది.

ఇజ్రాయెల్‌పై ఇరాక్
డ్రోన్ల దాడి

టెల్ అవీవ్ : ఇజ్రాయెల్-హెజ్బొల్లా ఉగ్రవాద సంస్థ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినప్పటికీ, నేటికీ దానిని ఉల్లంఘిస్తూ డ్రోన్ల దాడులు కొనసాగుతున్నాయి. ఇరాక్ వైపు నుంచి రెండు డ్రోన్లు తమ దేశంలోకి దూసుకొచ్చాయని, వాటిని కూల్చేశామని ఇజ్రాయెల్ తెలిపింది. వాటిని ఇరాక్ ప్రయోగించిందని చెప్పడానికి గుర్తు అవి తూర్పు వైపు నుంచి రావడమేనని చెప్పింది. మధ్యధరా సముద్రంలోని నావికాదళం పడవ సాయంతో వాటిని కూల్చేసినట్లు వివరించింది.

వాట్సాప్ గ్రూప్‌లో చేర్చి..
11 కోట్లు కొల్లగొట్టి

సైబర్ మోసం బారిన రిటైర్డ్ షిప్ కెప్టెన్

ముంబై: సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకున్నట్లు తెలిసేసరికి రిటైర్డ్ షిప్ కెప్టెన్ (75) రూ.11.16 కోట్లు పోగొట్టుకున్నారు. ఆయన మొబైల్ నంబరును ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆగస్టు 19న ఓ వాట్సాప్ గ్రూప్‌లో చేర్చారు. ఓ ప్రముఖ ఫైనాన్షియల్ సర్వీసెస్ కంపెనీ పేరుతో స్కామర్స్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోమని చెప్పారు. బాధితుడు రూ.11.16 కోట్లు అనేక బ్యాంకు ఖాతాలకు పంపించారు. తర్వాత బాధితునికి మోసపోయానని అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

దాడి చేస్తే మరింత పుంజుకుంటా: అదానీ

జైపూర్, నవంబర్ 30: అదానీ గ్రూప్‌నకు సవాళ్లు ఎదురవడం ఇదే మొదటిసారి కాదని ఆ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ చెప్పారు. రాజస్థాన్‌లోని జైపూర్‌లో శనివారం జరిగిన 51వ జెమ్ అండ్ జ్యూయెలరీ అవార్డ్స్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అదానీ గ్రీన్ ఎనర్జీ కంపెనీ అమెరికా చట్టాలకు అనుగుణంగా వ్యవహరించడం గురించి ఆరోపణలు వచ్చాయని తెలిపారు. ఇటువంటి సవాళ్లు ఎదురవడం తమకు ఇదే మొదటిసారి కాదన్నారు. అదానీ గ్రూప్‌పై జరిగే ప్రతీ దాడి దానిని మరింత బలోపేతం చేస్తుందని, ప్రతి అడ్డంకి దాని ఎదుగుదలకు ఓ మెట్టుగా మారుతుందని చెప్పారు.

గోవా సీఎం వ్యక్తిగత జీమెయిల్ హ్యాక్

పనాజీ, నవంబర్ 30: గోవా సీఎం ప్రమోద్ సావంత్ వ్యక్తిగత జీమెయిల్ ఖాతా హ్యాకింగ్‌కు గురైందని ప్రభుత్వ సీనియర్ అధికారి ఒకరు శనివారం తెలిపారు. 'గోవా పోలీస్ శాఖలోని సైబర్